

# మూగబోయిన ఊరూర పాట

## ప్రజాగాయకుడు గద్దర్ మృతి

కర్ర చేబూని ఎర్రజెండాతో ఎల్లప్పుడూ కనిపిస్తూ ప్రజా ఉద్యమంలో ప్రజలను ఉర్రూతలూగించిన పాటల కెరటం అలసిపోయింది. అమ్మ తెలంగాణమా ఆకలి కేకల గానమా.. పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా... మల్లెతీగకు పందిరి వోలే..నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా.. అంటూ గద్దర్ గొంతుక మూగబోయింది. గద్దర్ తెలంగాణకు శ్వాసించిండు. ఊరూరా ఉద్యమపాటై మోగిండు. దగాబడిన బతుకు వెతలను చూసి జనం గొంతుకయ్యిండు. గద్దర్ పాట పాడితే వేలాది గుండెలు చైతన్యవంతమవుతాయి. నేను సైతం అంటూ ప్రజాయుద్ధక్షేత్రంలోకి వస్తారు. అందుకనే ఆయనను ప్రజాయుద్ధనౌక అని వీరావేశంతో పిలుస్తారు.



ఆయన సభకు వస్తున్నారంటే చాలు వేలాది ప్రజలు ఎన్నిగంటలయినా వేచి ఉండేవారు. ఆయన గొంతు విప్పితే చాలు సమ్మోహనం. కోట్ల మంది పేదల కష్టాలను, నష్టాలను పాట రూపంలో వినిపించేవాడు గద్దర్. ఆదివారం గద్దర్ మృతిచెందారన్న వార్తతో నగరం దిగ్భ్రాంతికి గురైంది. భాగ్యనగరం శోకసంద్రమైంది. గద్దర్ మరణవార్త విని అభిమానులు, కళాకారులు అల్వాల్‌లోని ఆయన స్వగృహానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

**కర్ర పట్టి, ఎర్రజెండా**
**చేతపట్టిన ఉద్యమగొంతు**
**మరణవార్తతో నగరం దిగ్భ్రాంతి**
**తరలివచ్చిన అభిమాన జన తరంగం**



అమీర్‌పేట్ అపోలో ఆసుపత్రి వద్ద పాటలు పాడుతున్న విమలక్క, కళాకారులు

హైదరాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త : ప్రజా యుద్ధనౌక, పీడిత వర్గాల పాటగాడు, విప్లవ కారుడు గద్దర్ ఆదివారం అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్‌రావు, 1949 మెదక్ జిల్లాలోని తూప్రాన్‌లో లచ్చమ్మ, శేషయ్యలకు దళిత కుటుంబంలో జన్మించాడు. విద్యాభ్యాసం నిజామాబాద్ జిల్లా మహబూబ్‌నగర్‌లో, ఇంజనీ రింగ్ విద్య హైదరాబాద్‌లో జరిగింది. 1969 తెలంగాణ ఉద్యమంలో గద్దర్ చురుగ్గా పాల్గొన్నా రు. భావ వ్యాప్తికోసం ఆయన ఊరురా తిరిగి ప్రచారం చేశారు. దీనికొరకు ఆయన బుర్రకథను ఎంచుకున్నారు. ఆయన ప్రదర్శనను చూసిన సినిమా దర్శకులు బి.నరసింగరావు భగత్‌సింగ్ జయంతి రోజున ఒక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ప్రతి ఆదివారం ఆయన తన ప్రదర్శనలు ఇచ్చేవారు. 1971లో బి.నరసింగ రావు ప్రోత్సాహంతో మొదటి పాట 'ఆపర రిక్షా' రాశాడు. ఆయన మొదటి ఆల్బం పేరు గద్దర్. ఇదే ఆయన పేరుగా స్థిరపడింది. గద్దర్‌గా ప్రసిద్ధి చెందారు. 1972లో జన నాట్య మండలి ఏర్ప డింది. ఇది పల్లెల్లో జరుగుతున్న అకృత్యాలను, ఆరాచకాలను ఎదురించేందుకు, దళితులను మేల్కొల్పేందుకు వారిని చైతన్య పరిచేందుకు ఏర్పడింది. అయితే 1975లో గద్దర్ బ్యాంక్ రిక్రూట్‌మెంట్ పరీక్ష రాశారు.ఆయన కెనరా బ్యాంకులో క్లర్క్‌గా చేరారు. తర్వాత వివాహం చేసుకున్నారు. భార్య పేరు విమల, ఆయనకు ముగ్గురు పిల్లలు, సూర్యుడు, చంద్రుడు (2003 లో అనారోగ్యంతో మరణించాడు), కూతురు వెన్నెల. తర్వాత తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో చేరి..తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు గద్దర్. తన పాటలతో ఉద్య మాలకు ఊపుతెచ్చారు. 1997 ఏప్రిల్ 6న గద్ద ర్‌పై హత్యాయత్నం జరిగింది. వెన్నులో బుల్లెట్ బాధపెడుతున్నా అణగారిన గొంతుకల కోసం పాటను పల్లెపల్లెకు తీసుకెళ్లారు.తూటాలు దిగినా ఆయన వెనుకంజవేయలేదు. తుదిశ్వాస వరకు గొంతులేని వారి కోసం గొంతుకగా మారారు. గళమెత్తారు. ఆడారు.. పాడారు. వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అహరహం పోరాటం చేశారు. ఒక అమ్మ తెలంగాణమా, పొడుస్తున్న పొద్దుమీద పాటలతో తెలంగాణ ఉద్యమాలకు ఊపుతెచ్చారు. నీపాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా అనే పాటకు నంది అవార్డు వచ్చింది. కాని నంది అవార్డును తిరస్కరించారు గద్దర్. గద్దర్ గాయకుడే కాదు. మంచి రచయిత కూడా, ప్రజల వేదనలను పాటలుగా రూపొందించారు. "సిమల్లె సెట్టుకింద లచ్చుమమ్మో" పాటలో తన తల్లి పడుతున్న బాధలను పాటగా మలిచారు. ఇంకా అనేక పాటు ప్రజల పక్షాలన నిలిచాయి.



# హైదరాబాద్ వార్త

# అడుగుకో గుంత

**ఛిద్రమైన నగర రహదారులు**

**ఆ రూటూ.. ఈ రూటూ**
**ఏ రూటైనా కుదిపేస్తోంది..!**
**పట్నంలో బండి నడుపుడు గండమే**
**గంటల కొద్దీ ప్రయాణం నరకం**
**మరోవైపు దుమ్మురేపుతున్న కాలుష్యం**
**నగర ప్రధాన రోడ్లలతో ఉక్కిరిబిక్కిరి**



హైదరాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త : మేడిపల్లి కమాన్, నాచారం మీదుగా సికింద్రాబాద్ క్లాక్‌టవర్ వరకు 14 కి.మీ మార్గంలో 52పైగా గుంతలు..ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ నుంచి సీతాఫల్‌మండి, లిబర్టీ, రాణిగంజ్ మీదుగా సికింద్రాబాద్ క్లాక్‌టవర్ వరకు 18 కి.మీ మార్గంలో 48పైగా గుంతలు.నగరంలోని రోడ్ల దుస్థితిని చెప్పేందుకు ఈ రెండు ఉదాహరణలు చాలవూ..ఇక ఉప్పల్ చౌరస్తా నుండి నారపల్లి (వరంగల్ జాతీయ రహదారి), రామం తాపూర్ టివి స్టూడియో నుండి అంబర్‌పేట మీదుగా చాదర్‌ఘాట్ వరకు బండి నడపుడు గండంగా మారుతోంది. వర్షం వచ్చిందంటే గ్రేటర్ లో ప్రయాణం నరకంగా మారు తోంది. అడుగుకో గుంత వాహనదారులను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షాలకు రహదారులు ఛిద్రమై ఏ దారైనా కుదిపేస్తోంది. ఫలితం గా వాహనదారుల ఒళ్లు హూనమవు తోంది. అంతేకాకుండా గంటలో చేరుకోవాల్సిన గమ్యానికి రెండు గం టలు పడుతోంది. మేడిపల్లి, బోడుప్పల్, ఫిర్జాదీగూడ, ఉప్పల్, రామం తాపూర్, అంబర్‌పేట, గోల్నాక ప్రాంతాల్లోని వరంగల్ జాతీయ రహ దారి పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. ఇక నల్లచెరువు రోడ్డు పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. కొన్ని ప్రాంతాల్లో అడుగుకో గుంతతో బండి నడపడం వాహనదారులకు కష్టంగా మారింది. కంకర తేలిన రోడ్లు యమకింకరులను గుర్తుకు తెస్తున్నాయి. ఈ మధ్య కురుస్తున్న వానలతో సిటీ రహదారులు ఎక్కడికక్కడ గుంతలమయంగా మారాయి. వీటిని దాటుకుని వెళ్లాలంటే వాహనచోదకులు ఒళ్లు హూనమవు తోంది. నడుములు పట్టేస్తున్నాయి. గుంతల రహదారులపై బైక్‌లే కాదు కార్లు, ఆటోలు, ఆర్టీసి బస్సులకు బ్రేక్‌లు పడుతున్నాయి. ఉద్యోగులు, డ్రైవర్లు, ఇతరులు నానా యాతన పడుతున్నారు. ఇంధనాన్ని వాహనాలు లీటర్లకు లీటర్లు తాగేస్తున్నాయి.



వాహనదారుల దయనీయ పరిస్థితి. నగరంలోని పలు దారులు ప్రత్యక్ష నరకాన్ని చవిచూపిస్తున్నాయి. వాహ నాలు గుంతల్లో పడుతూ లేస్తూ భారంగా ముందుకెళ్తున్నాయి. రోడ్లు కొన్నిచోట్ల కుంగిపోయాయి. ఈ మధ్య వరుస వర్షాలతో రోడ్ల 'సొగసు' బయటపడుతోంది. పలు ప్రాంతాల్లో వర్షానికి రోడ్డు దెబ్బతింటున్నాయి. దీంతో ప్రజల అవస్థలు షరామా మూలుగా మారాయి. జిహెచ్‌ఎంసి రోడ్ల పనులు సరిగా చేయడం లేదని భావించి ప్రధాన మార్గాల్లో నిర్మాణ, నిర్వహణ పనుల్ని పెద్ద కాంట్రాక్టు సంస్థలకు అప్పగించారు. ఇలా 709 కిలో మీటర్ల రోడ్లను జోన్లు, ప్యాకేజీల వారీగా అప్పటించారు. ఆయా మార్గాల్లో సదరు సంస్థలు చేసిన రీ కార్పెటింగ్, లేన్ మార్కింగ్‌లతో రోడ్లు పైకి బాగానే కనిపిస్తున్నప్పటికీ ఎన్నో మార్గాల్లో వర్షపు ధాటికి రోడ్లు దెబ్బతిన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా రోడ్లు గుంతల మయంగా మారడంతో పాటు వరద నీటితో కొట్టుకు వచ్చిన మట్టి మేట వేసింది. ఒక వైపు గుంతలు, మరో వైపు మట్టి, కంకర ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. పట్టుమని పది మీటర్లు కూడా కుదుపులేని ప్రయాణం నగర రోడ్లపై సాగే పరిస్థితి లేదు. ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోన్న ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, లింగంపల్లి ప్రాంతాల్లో రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. ఔటర్ రింగ్‌రోడ్డు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈ మార్గంలో వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారు. కర్మన్‌ఘాట్, చంపాపేట, చాంద్రాయణగుట్టల మీదుగా శంషాబాద్‌కు వెళ్లే వారికీ అదే దురవస్థ, చేరుకోవాల్సి న గమ్యస్థానానికి వెళ్లేందుకు పాడైన రహదారుల వల్ల సమయ భారం పడుతోంది.

వరద నీటితో కొట్టుకు వచ్చిన మట్టి మేట, కంకరతో ప్రధాన రహదారుల్లో దుమ్ము..మరోవైపు ఊపిరిసలపని రీతిలో శ్వాసకోశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాయు కాలుష్యంతో నగరవాసులు విలవిల్లాడుతున్నారు. వాహనాల రాకపోకలతో సూక్ష్మ, స్థూల ధూళి కణాలు నేరుగా శ్వాసకోశాల్లోకి వెళుతున్నాయి. దీంతో మధ్యాహ్నం వేళ ఇంటి నుంచి బయటకు వెళ్లినవారిపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం పొంది ఉంది. పిసిబి నిబంధనల ప్రకారం ప్రతి ఘనపు మీటరు గాలిలో ధూళికణాలు 60 మైక్రోగ్రాములు మించరాదు. కానీ నగరంలో పలు కూడళ్ల వద్ద 90-105 మైక్రో గ్రాముల మేర వాయు కాలుష్యం నమోదవుతుండడం గమనార్హం. గ్రేటర్ పరిధిలో సుమారు 65 లక్షలకు పైగా ఉన్న వాహనాలు వెదజల్లుతున్న పొగ, ట్రాఫిక్ రద్దీతో రహదారులపై రేగుతున్న దుమ్ముతో సిటీజన్ల ముక్కుపుటాలు, శ్వాసకోశాలు దెబ్బతింటున్నాయి. సూక్ష్మ, స్థూల ధూళి రేణువులు పీల్చే గాలిలో చేరి నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లడంతో తీవ్రమైన శ్వాస కోశ వ్యాధులు, పొడి దగ్గు, బ్రాంకైటీస్‌కు కారణమవుతున్నాయి. దుమ్ము ధూళి కళ్లలోకి చేరి రెటీనా దెబ్బతింటుంది. చికాకు, అసహనం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తుతోంది. తలనొప్పి, పార్శ్యపు నొప్పికి దారి తీస్తోంది. ధూళి కాలుష్య మోతాదు క్రమంగా పెరుగుతుంటే ఊపిరితిత్తుల కేన్సర్లు పెరిగే ప్రమాదం పొంచి ఉంది.ఇటీవల నగరంలో శ్వాసకోశ సమస్యలు, అస్తమా, క్రానిక్ బ్రాంకైటిస్, సైనస్ సమస్యలు పెరగడానికి ప్రధాన కారణం వాతావరణ మార్పులు, వాయు కాలుష్యమే. ముక్కుకు మాస్క్‌లు, కళ్ల రక్షణకు అద్దాలు ఉపయోగించడం ద్వారా దుష్ప్రభవాలను నివారించే అవకాశాలున్నాయి.

## వేలం భూముల పరిశీలనకు వెళ్తున్న బిజెపి నాయకులు అరెస్టు



కోకాపేట్‌లో వేలం వేసిన భూములను పరిశీలించేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

నార్సింగి, ఆగస్టు 6 ప్రభాతవార్త : భావి తరాల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ భూముల వేలాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు బొక్క నర్సిహ్మారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల కోకాపేటలో వేలం వేసిన భుములను పరిశీలించేందుకు ఆదివారం బీజేపీ నాయకుల బృందం వస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు ఔటర్ రింగ్ రోడ్డు వద్దనే అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు సీఏం డౌన్ డౌన్, భూ బకాసూరుడు కేసీఆర్, భుముల వేలాన్ని వెంటనే నిలిపివేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నర్సిహా మ్రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ సర్కారు రంగారెడ్డి జిల్లాలోని కోట్ల రూపాయల విలువైన భూములు వేలం వేసి ఆ ధనంను తమ సొంత నియోజకవర్గాలకు తరలించుకెళ్తున్నారని ఆరోపించారు. రంగారెడ్డిని ఆదాయ వనరుగా మార్చుకున్నారని, వసతులు మాత్రం కల్పించడం లేదన్నారు. నీటి ప్రాజెక్టులు, విధ్యాలయాలు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఆసుపత్రులు ఇలాంటివి నిర్మించకుండా మా జిల్లా వాసులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నిరంకుశ, నియంతృత్వ పాలన చేస్తున్న సీఏం కేసీఆర్‌కు రోజులు దగ్గర పడ్డాయని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గద్దె దింపడం ఖాయమైపోయిందన్నారు. భావి తరాల ప్రజల అవసరాల కోసం ఇక నుంచి భూముల వేలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆపి వేయాలని, లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని నర్సిహ్మారెడ్డి హెచ్చరించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో బీజేపీ సీనియర్ నేతలు అంజన్ కుమార్, నరేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నాగేష్, గండిపేట మండల బిజెపి అధ్యక్షులు చిక్కిరి బిక్షపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని డ్రైవర్ ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి,ఆగష్టు 6 ప్రభాతవార్త : కుటుంబ కలహాలతో విసిగి చెంది ఓ భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. నందిగామ మేకగూడ ప్రాంతానికి చెందిన వై.ఆంజనేయులు (30) వృత్తి రీత్యా డ్రైవర్.ఆంజనేయుల వివాహం 2017లో బుద్వేల్‌కు చెందిన ఓ యువతితో జరిగింది.ఆంజనేయులకు కొడుకు,కుమార్తె కలరు.కాగా గత కొంత కాలంగా భార్య భర్తలు మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ నెల 5వ తేదీ రాత్రి ఆంజనేయులు బుద్వేల్‌లోని అత్తవారి ఇంటికి ఎదురుగా గ్రిల్స్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేసుకుని ఆంజనేయుల మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు.పోస్టుమార్టం అనంతరం ఆంజనేయుల మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. ఈ కేసును రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు పలు ప్రాంతాలలో మంచినీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త : నగరంలో నేడు పలు ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని జలమండలి ప్రకటించింది. సింగూరు నుంచి హైదరాబాద్ నగరానికి తాగునీటి సరఫరా చేస్తున్న 1200 ఎంఎం డయా పిఎస్‌సి పైపులైన్‌కు ఖానాపూర్ వద్ద భారీ లీకేజీ ఏర్పడింది. ఈ లీకేజీని అరికట్టేందుకు సోమవారం ఉదయం 6గంటల నుంచి మంగళవారం ఉదయం 6గంటల వరకు మరతమత్తులు పనులు చేపట్టనున్నారు. 24గంటల పాటు సింగాపూర్ నుంచి ఖానాపూర్ వరకు ఉన్న రిజర్వాయర్ పరిధిలోని నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. డివిజన్-3లో షేక్‌పేట్, టౌలిచౌకి, గోల్కొండ, బోజగుట్ట రిజర్వాయర్, డివిజన్ 18 పరిధిలో గండిపేట, కోకాపేట, నార్సింగ్, పుప్పాలగూడ, మణికొండ, ఖానాపూర్, నెక్నాంపూర్, మంచి రేవుల ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

**గద్దర్ మృతిపట్ల డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ దిగ్భ్రాంతి**

సికింద్రాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త : ప్రముఖ కవి, ప్రజా గాయకుడు గద్దర్ మృతిపట్ల డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గద్దర్ గాయకుడిగా ఆటపాటలతో లక్షలాధి మంది అభిమానాన్ని చూరగొన్నారని, ప్రజల్లో చైతన్యం నెలకొల్పారని పద్మారావుగౌడ్ తెలిపారు. గద్దర్ ఆకాల మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని, ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులకు తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థింగాచారు.

## దుర్మార్గపు దుశ్చర్య!

**అక్కడికక్కడే మృతి చెందిన యువతి**

### పెళ్లిచేసుకోమంటే లారీ కింద తోసేశాడు



ప్రమీలా (ఫైల్)

నిజాంపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త: ప్రేమించిన యువతి తన ప్రియుడిని పెళ్లి చేసుకోని కోరగా లారీ కింద తోసే శాడు. ప్రమాదంలో యు వతి అక్కడికక్కడే దుర్మ రణం చెందింది. ఈసంఘ టన అదివారం బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా, మాసారెడ్డి మం డలం, నెమలిగుట్టతాండాకు చెందిన ప్రమీల(23) అనే యువతి ఐదునెలల క్రితం జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చి దుండిగల్ మున్సిపాలిటీ, బౌరంపేటలోని ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటుంది. బాచుపల్లి లోని ప్రెస్టీజ్ షోరూంలో సెల్స్‌గర్ల్‌గా పనిచేస్తూ ఉపాధి పొందుతుంది. అదే ప్రాంతం రోడ్డుబండా తాండాకు తిరుపతి అనే యువకుడు కొండాపూర్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలం క్రితం ఎదురుపడిన వీరు ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో పరిచయం పెంచుకున్నా రు. అదికాస్తా ప్రేమగా మారి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకు న్నారు. అయితే కొద్దిరోజులు గా ప్రమీలా పెళ్లి ప్రస్తావన తీసుకువస్తే తిరుపతి దాటి వేస్తూ కాలయాపన చేస్తు న్నాడు. ఈక్రమంలో అది వారం ఇరువురు బాచుపల్లి వాసవి కన్‌స్ట్రక్షన్స్ సమీపంలో కలుసుకున్నారు. ప్రమీలా పెళ్లి విషయమై అడుగగా తిరుపతి మళ్లీ దాటివేసే ప్రయత్నం చేయగా గట్టిగా నిలదీసింది. దీంతో కొపోద్రిక్తుడైన తిరుపతి రోడ్డుమీద వెళ్తున్న లారీ కిందకు ఆమెను తోసేశాడు. ఈప్రమాదంలో ప్రమీలా అక్కడికక్కడే దుర్మరణం చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీకి తరలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా నిందితుడు తిరుపతి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## రమణీయం భరతనాట్యాభినయం



శ్రావ్య భరతనాట్య ప్రదర్శన

రవీంద్రభారతి, ఆగస్టు 6 ప్రభాతవార్త : అమెరికాకు చెందిన నాడ్ స్టూడియోస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రము ఖ నాట్యగురువు నేహాపటేల్ శిష్యు రాలు గన్నా శ్రావ్య అక్కడి క్యాలీ ఫోర్ని యాలో గ్రాడ్యు యేషన్ పూర్తిచేసి న్యాయశాస్త్రం అభ్యసి స్తోంది. భారత శాస్త్రీయ కళలపై అభిరుచితో తల్లి దండ్రులు శ్రీధర్, శ్వేతల ప్రోత్సాహంతో 8వ సంవత్సరం నుండే గురువు వద్ద నృత్యశిక్షణ ప్రారంభించింది.

**ప్రజా గాయకుడు గద్దర్ మృతి ప్రజలకు తీరనిలోటు : జంపనప్రతాప్**

కంటోన్మెంట్, ఆగస్టు 6 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమ నేత,ప్రజా గాయకుడు ఉద్యమ పాటలతో తెలంగాణ ప్రజలను చైతన్యపర్చిన ప్రజా గాయకుడు గద్దర్ మృతి చెందడం పట్ల ప్రజలకు తీరనిలోటు ఏర్పడిందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. ఆదివారం గద్దర్ మృతి చెందిన విషయం తెలియడంతో ఆయనకు ఉన్న ప్రత్యేక అనుభందాన్ని గుర్తు చేశారు.

## 8న ఆటో డ్రైవర్లు 'రవాణా శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి'



మీడియా సమావేశంలో ఐక్యత చాటుతున్న జెఎసి నాయకులు

సైఫాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది ఆటో డ్రైవర్లతో ఈ నెల 8న 'రవాణా శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి' చేపడుతున్నామని తెలంగాణ ఆటో రిక్షా, క్యాబ్ డ్రైవర్ల సంఘాల సంఘాల జెఎసి హెచ్చరించింది. ఈ మేరకు ఆదివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి ప్రతినిధులు బి.వెంక టేశం, శ్రీకాంత్, సత్తిరెడ్డి, కిరణ్ తదితరులు మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్రం వచ్చి 9 ఏళ్ళు గడించినా ఆటో, మోటారు రవాణా రంగ కార్మికుల సమస్యలను పరి ష్కారం కాలేదని ఆరోపించారు. కార్మికులు ఆనేక పోరాటాలు నిర్వహించిన రవాణా శాఖ పట్టించు కున్న దాఖలాలు లేవని విమర్శించారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి తగినన్ని నిధుల కేటాయించాలని, గ్రేటర్ హైదరాబాద్‌లో కొత్త ఆటోలకు పర్మిట్‌లు ఇవ్వాలని, ఆటో మీటర్ చార్జీలు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే పెరిగిన ఇన్సూరెన్స్ ధరలను తగ్గించాలని, ప్రమాద బీమా 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలని, సాధారణ మరణాలకు, అంగవైకల్యాలకు కూడా వర్తింప జేయాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లాగా ఆటో డ్రైవర్లకు ఆరోగ్య మిత్ర పథకాన్ని ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేయాలని, ఆటోలకు తగినన్ని పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ ఫెనాల్టిని తక్షణమే రద్దు చేయాలని, సిఎన్‌జి కొరత నివారణకు ఎక్కువగా బంక్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సి.హెచ్.జంగయ్య, ఎస్‌కె లతీఫ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ మృతి తెలంగాణ సమాజానికి తీరనిలోటు

**చంద్రమోహన్ గౌడ్**

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 6 ప్రభాతవార్త : ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఆకస్మిక మరణం యావత్ తెలంగాణ సమాజానికి తీరని లోటని సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.చంద్ర మోహన్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మలిదశ తెలం గాణ ఉద్యమంలో ప్రజా గాయ కుడు గద్దర్ కీలక పాత్ర పోషిం చారని గుర్తు చేశారు. తన పాట లతో ఉద్యమంలో తన పాటలతో ఉద్యమ స్పూర్తిని రగిలించి ఉద్య మానికి ఒక ఊపు తీసుకువచ్చా రని అన్నారు. గద్దర్ కుటుంబా నికి చంద్రమోహన్ గౌడ్ సానుభూతిని తెలియజేశారు.

## నెక్లెస్‌రోడ్‌లో ఉత్సాహంగా రన్ ఫర్ ఎస్ఎమ్ఎ

**ప్రారంభించిన హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, నిమ్స్ డైరెక్టర్**



హైదరాబాద్, ఆగస్టు 6,ప్రభాతవార్త: స్పైనల్ మస్కు లర్ అట్రోఫి (ఎస్ఎంఏ) అవగాహన పెంచడానికి హైదరాబాద్‌లోని నిర్వహించిన "రన్ ఫర్ ఎస్ఎమ్ఎ" ఉత్సాహంగా సాగింది. ఆదివారం ఉదయం 6.30 నెక్లెస్‌రోడ్‌లో ప్రముఖ ఎన్జీవో క్యూర్ ఎస్ఎమ్ఏ ఇండి యా ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈకార్యక్రమానికి హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ జితేందర్, నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా వారు వెన్నుముక కండరాల క్షీణత వంటి అరుదైన పరిస్థితులను పరిష్కరించడంలో ఫార్మాస్యూటికల్ కంపెనీలు బాధ్యత వహించాలనిఅన్నారు. ఎస్ఎంఏ రోగుల జీవితాలను మెరుగుపర్చడానికి తన వ్యక్తిగత నిబద్ధతను ప్రతిజ్ఞ చేశారు. వారు సంతృప్తిగల జీవితలను పగడపడానికి సమాన అవకాశాలను కలిగి ఉన్నారని భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా 5కె, 10కెరన్‌లో ఉత్సాంగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

## వృద్ధులైన తల్లిదండ్రులను విస్మరిస్తే సమాజం క్షమించదు



నిరుపేదలకు ఉచితంగా నిత్యావసర వస్తువులను పంపిణి చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యుడు నరసింహులు

సైఫాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త: ఉద్యోగాలు, ఇతర రంగాలలో స్థిరపడిన వారు వృద్ధులైన తమ తల్లిదండ్రులను విస్మరిస్తే సమాజం క్షమించదని లయన్స్ క్లబ్ సభ్యుడు పి.నరసింహులు హెచ్చరించారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలకు గురై పిల్లలను పెంచి పోషించి మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దుతున్నారని, వారికి అండగా ప్రేమగా చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలపైన ఉందన్నారు. శ్రీకర సత్య సేవా సహకార సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నాడిక్కడ నిరుపేద వృద్ధులకు నిత్యావసర వస్తువులను పంపిణి చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటి యువతరం తల్లిదండ్రులపై చూపిస్తున్న ప్రేమానురాగాలు భావితరాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రిక జీవితం, సెల్‌ఫోన్‌లతో మనుషుల మధ్య సంబంధ బావ్యాలు దెబ్బతింటున్నాయిని విచారం వ్యక్తం చేశారు. పిల్లలు తల్లిదండ్రులతో కొంతసేపు గడుపుతూ వారికి సంతోషాన్ని అందించాలని సూచించారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ దేవాలయంలో భవిష్యవాణి వినిపించే మాతంగి స్వర్ణలత మాట్లాడుతూ సమాజంలోని వృద్ధులందరూ మహంకాళీ అమ్మవారి దయతో చల్లగా ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది నూతి శ్రీకర్‌శర్మ, సభ్యుడు మనిగండ్ల శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## వరద ముంపు ప్రాంతాలైన భద్రాచలం పరిసరాల్లో ఫ్లడ్ రిలీఫ్ సెంటర్లు నిర్మిస్తాం

రోటరీ క్లబ్ గవర్నర్ శంకరరెడ్డి



సమావేశంలో పాల్గొన్న రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్, ప్రతినిధులు

బేగంపేట ఆగస్టు 6,ప్రభాతవార్త : ఇటీవల కాలంలో వరదలతో తెలంగాణా లోని అనేక ప్రాంతాల్లో ప్రజలు నిరాశ్రయులు కావడంతో పాటు చాలా ఇబ్బందులు పడ్డారని, రానున్న రోజుల్లో వారు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వరద ముంపు ప్రాంతాలైన భద్రాచలం పరిసరాల్లో ఫ్లడ్ రిలీఫ్ సెంటర్లు నిర్మించనున్నట్లు రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ శంకరరెడ్డి తెలియజేసారు.ఆదివారం రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని బెల్సన్ తాజ్ హోటల్‌లో రోటరీ క్లబ్ అభ్యుదయ్ 3వ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన క్లబ్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులతో పాటు వివిధ పదవులకు ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ప్రతినిధులు తమ వ్యాపారాలు, ఉద్యోగాల్లో బిజీగా ఉన్నప్పటికీ తమలోని సేవాగుణంతో నిస్వార్ధంగా సేవలు అందిస్తున్నారని కొనియాడారు.పేదలు అట్టడుగు వర్గాలు అవసరం ఉన్న వారికి ఎలాంటి ప్రతి ఫలం ఆశించకుండా చేసేది నిజమైన సేవ అని ఆయన అన్నారు.వరద సమయాల్లో వీటిని రిలీఫ్ సెంటర్లు గా వాడుకోవచ్చుని మిగిలిన సమయంలో కమ్యూనిటీ హాల్సులాగా వాడుకోవచ్చని ఆయన తెలియజేసారు.ఈ కార్యక్రమంలో డీజీఈ శరత్‌చౌదరి,డీజీఎస్ రాంప్రసాద్,అసిస్టెంట్ గవర్నర్ మల్లిఖార్జున్ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్

కార్మికనేత, నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరెడ్డి



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాసరెడ్డి తదితరులు

ధర్నాచౌక్, ఆగస్టు 6, ప్రభాతవార్త: తెలంగాణ ఉద్య మ స్ఫూర్తి ప్రదాత, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్మికనేత, నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి, మాజీ కార్పోరేటర్ వి.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్ లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పి, తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో ఆయన ఆశయాల సాధనకై మన తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ యువనేత కార్తీక్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భిక్షపతి యాదవ్, నేత శ్రీనివాస్, రేషం మల్లేష్, బుజ్జి వెంకటేశ్వర్‌రావు, సిరిగిరి శ్యాం, సిరిగిరి కిరణ్, ప్రభాకర్, కల్పన, రేఖ, సాలమ్మ, సత్యనారాయణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## నవ్యకవితా పితామహుడు రాయప్రోలు సుబ్బారావు



ప్రముఖ కవి రాయప్రోలు సుబ్బారావు చిత్రపటానికి నివాళులు అర్పించి ప్రసంగిస్తున్న సీబీఐ కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ

చిక్కడపల్లి, ఆగస్టు 6 ప్రభాతవార్త: నవ్య కవితా పితామహుడు రాయప్రోలు సుబ్బారావు అని సీబీఐ కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ అన్నారు. శతాబ్దిపూర్వమహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా సుప్రసిద్ధ సాహితీవేత్త రాయప్రోలు సుబ్బారావు సంస్మరణ సమావేశం త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో ఆదివారం కళాసుబ్బారావు కళావేదికలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా జస్టిస్ నాగమారుతిశర్మ హాజరై రాయప్రోలు సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ప్రసంగించారు. విశ్రాంతన్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జస్టిస్ నాగమారుతి శర్మ మాట్లాడుతూ తెలుగులో భావ కవిత్వానికి ఆద్యుడు అని, ఆయన 1913లో రాసిన 'తృణకంకణముతో తెలుగు' కవిత్వంలో నూతన శకము ఆరంభమైందని అంటారని, ఇందులో ఆయన అమలిన శృంగార తత్వాన్ని ఆవిష్కరించారన్నారు. ప్రేమక పెళ్లికి దారితీయని యువతీ యువకులకు స్నేహితులుగా మిగిలిపోవడానికి నిర్ణయించుకున్న ఇతివృత్తంలో ఖండకావ్యప్రక్రియకు అంకురార్పణ చేశారన్నారు. తెలుగు, సంస్కృత భాషా పటిమను ఆయన వీడలేదన్నారు.

## బన్సీలాల్‌పేట్‌లో ఘనంగా బోనాల ఉత్సవాలు



బోనాల ఉత్సవాలలో అమ్మవారి దర్శనం చేసుకుంటున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త: తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే బోనాల ఉత్సవాల ను ఘనంగా జరుపుకోవా లని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం బోనాల ఉత్సవాల సందర్భంగా బన్సీలాల్ పేట్ డివిజన్‌లోని బండ మైసమ్మనగర్ డీక్లాస్ ఐడీహెచ్, జయ ప్రకాష్‌నగర్, మేకలమండి, గొల్ల కొమురయ్య కాలనీ, రైల్‌కళారంగ్ తదితర ప్రాంతాల్లోని ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల అభివృద్ధి నిర్వాహకులు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కెసిఆర్ బోనాల సందర్భంగా వచ్చే లక్షలాది మంది భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత బోనాల ఉత్సవాల విశిష్టత మరింత పెరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎల్. వెంకటేషన్ రాజు, నేతలు ప్రేమ్, రమణ, కృష్ణ, నర్సింగ్, శ్రీనివాస్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## యాదవ మహాసభ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించాలి

యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఐలబోయిన రమేష్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ యాదవ్, లక్ష్మణ్‌యాదవ్

హైదరాబాద్, ఆగస్టు 6,ప్రభాతవార్త: అఖిలభారత యాదవ మహాసభ శతాబ్ది ఉత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని అఖిలభారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు అయిలబోయిన రమేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో యాదవమహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల రవీందర్‌యాదవ్ తదితరులతో కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిలభారత యాదవ మహాసభ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జాతీయ నాయకుల ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అలాగే కులగణన చేపట్టాలని పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మేకల రాజేందర్‌యాదవ్, బాలమల్లేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

### దోమలు వ్యాప్తి చెందకుండ ప్రజలు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి,ఆగస్టు 6 ప్రభాతవార్త : దోమలు వ్యాప్తి చెందకుండ ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్,జిహెచ్‌ఎంసి కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.ఇంటి పరిసరాలను శు భ్రం చేసే కార్యక్రమాన్ని ఆయన ఆదివారం జిహెచ్‌ఎంసి ఎంట్రోమాలజీ ఎస్ఇ నామాల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు.దోమలు నివారణకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెందే అవకావం ఉందని, ప్రతీ ఒక్కరూ పూల కుండీలు,ఎయిర్ కూలర్లు,కుండలలో నీరు నిల్వ లేకుండ పరిశు భ్రం చేసుకోవాలని కోరారు.మీ ఆరోగ్యం మీ చేతుల్లో ఉందని,ప్రజలు తప్పకుండ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశు భ్రంగా ఉంచుకోవలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎం ట్రో మాలజీ సూపర్‌వైజర్ జె.విశాల్,ఎస్.ప్రభాకర్, జి.శ్రీనివాస్,జనార్ధన్‌లు పాల్గొన్నారు.

### ఆత్మరక్షణకు టైక్వాండో ఎంతో ఉపకరిస్తుంది

చిక్కడపల్లి, ఆగస్టు 6 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతో పాటు టైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్‌ను నేర్చుకుంటే ఆత్మరక్షణకు ఎంతో ఉపకరిస్తుందని బిఆర్ఎస్ రాష్ట్ర యువనేత ముఠాజైసింహ్ అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లోని జిహెచ్‌ఎంసి ప్లేగ్రౌండ్ లోని తెలంగాణ అసోసియేషన్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ టైక్వాండో మార్షల్ ఆర్ట్స్, మార్షల్ మాస్టర్ బి.కృష్ణ ఆధ్వర్యంలో బెల్ట్, గ్రీటింగ్స్, బ్లాక్‌బెల్ట్, సర్టిఫికేట్ల ప్రదానోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా జైసింహ్ హాజరై సర్టిఫికేట్లను ప్రదానంచేసి ప్రసంగించారు. కార్యక్రమంలో హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి సుబ్రమ్మణ్యం, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాహ అజ ఆలీ ఖాన్,, మాస్టర్ బి.కృష్ణ కోచ్‌లు మనీష్, కార్తీక్, స్వామి, జాన్సన్, రాగిణి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు. చదువుతో పాటు ఇటువంటి క్రీడల పట్ల యువతీ యువకులు దృష్టిని సారిస్తే మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. మహిళలు కూడా శిక్షణ పొందితే ఆత్మరక్షణకు ఎంతో ఉపకరిస్తుందన్నారు.

### ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి : జక్కుల మహేశ్వర్ రెడ్డి



1వ వార్డు జయ నగర్‌లో జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న జక్కుల మహేశ్వర్ రెడ్డి తదితరులు

కంటోన్మెంట్,ఆగస్టు 6 ప్రభాతవార్త: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ ఆశయాలను ప్రతి ఒక్కరు సస్ఫూర్తిగా తీసుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం 1వ వార్డు జయనగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### శంకర్‌నగర్ చౌరస్తాలో జయశంకర్ జయంతి

యూసుఫ్‌గూడ, ఆగస్టు 6, ప్రభాతవార్త : ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా రహ్మత్ నగర్ డివిజన్ పరిధిలోని బ్రహ్మ శంకర్ నగర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ షేరా ఆలం, విజేష్, మహ్మద్ అహ్మద్, మహ్మద్ కలీమ్,వేణు, కిషోర్, గిరీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీఆర్ఎస్ నాయకుడు శ్రీగణేష్ జన్మదిన వేడుకలు

అభినందనలు తెలియజేసిన పలువురు కంటోన్మెంట్ నేతలు



శ్రీగణేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న మన్నె క్రిషాంక్

బేగంపేట ఆగస్టు 6,ప్రభాతవార్త : కంటోన్మెంట్ బీఆర్ఎస్ నాయకుడు శ్రీగణేష్ జన్మదిన వేడుకలు కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని రాయల్ లీ ప్యాలెస్ లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నేతలు,పలు కాలనీలు,బస్తీ వాసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని శ్రీగణేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో బేవరేజెస్ కార్పోరేషన్ ఛైర్మన్ గజ్జెల నాగేష్,టీఎస్ఎండీసీ ఛైర్మన్ మన్నె క్రిషాంక్,కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ ప్రెశిడెంట్లు జక్కుల మహేశ్వరరెడ్డి,సదాకేశవరెడ్డి,మాజీ బోర్డు సభ్యులు నళినీకిరణ్, శ్యాంకుమార్, లోకనాథం,బీఆర్ఎస్ నాయకులు సాయికిరణ్ లతో పాటు పలువురు ప్రజాసంఘాల నాయకులు, వ్యాపార వర్గాలకు చెందిన వారు,పలు కాలనీలు,బస్తీల వాసులు శ్రీగణేష్ కు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా పలువురు భారీ పూలమాలలతో ఆయనను ఘనంగా సత్కరించారు.

## పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్‌ల బిల్లు ప్రవేశపెట్టేంతవరకు పోరాటం

రాష్ట్ర బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బర్ల మణి మంజరి

చిక్కడపల్లి, ఆగస్టు 6 ప్రభాతవార్త: పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్‌ల బిల్లు ప్రవేశపెట్టేంతవరకు పోరాటాన్ని ఆపే ప్రసక్తేలేదని రాష్ట్ర బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బర్ల మణి మంజరి పేర్కొన్నారు. బిల్లులను ప్రవేశపెట్టడంతో పాటు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. ఎన్నో ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్న బీసీ సమస్యలను పరిష్కరించాలన్నారు. జనాబాలో దామాషా ప్రకారంగా బీసీలు ఎంతమంది వరకు అంత వాటా రావాల్సిందేనని అన్నారు. జాతీయ ఓబీసీ సమావేశాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మణిమంజరి పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు స్వర్ణగౌడ్, కోశాధికారి తారకేశ్వరి, కార్యదర్శి సమతా యాదవ్, గౌతమి, లలితతో పాటు ఇతర మహిళా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. 75 ఏళ్ళ స్వాతంత్ర్య పాలనలో 60శాతం ఉన్న బీసీలకు 15శాతం ప్రాతినిధ్యం కూడా ప్రభుత్వాలు కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు.

## ఉర్దూ భాషాభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం



ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రధానం చేస్తున్న దృశ్యం

చార్మినార్,ఆగస్టు 6 ప్రభాతవార్త : ఉర్దూ భాషాభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తున్నదని రాష్ట్ర ఉర్దూ అకాడమీ అధ్యక్షులు మహ్మద్ ఖాజా ముజీబుద్దీన్ అన్నారు. పాతబస్తీ కిల్వత్‌లోని ఉర్దూ మస్కాన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో పని చేస్తున్న మూడు విద్యాసంవత్సరాలకు సంబంధించిన 211 మంది ఉర్దూ ఉపాధ్యాయులకు ఉర్దూ అకాడమీ అధ్యక్షులు మహ్మద్ ఖాజా ముజీబుద్దీన్ ఉర్దూ అకాడమీ తరుపున ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డుతో ప్రశంసా పత్రాలను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ఉర్దూ భాషాభివృద్ధి కోసం పాటు పడుతున్నదని తెలిపారు.తెలంగాణ ఉర్దూ అకాడమీ కార్యదర్శి బి.సఫీయుల్లా,ఉర్దూ అకాడమీ సూపరిండెంట్ కృష్ణతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అన్నిపార్టీలు బిసి ముఖ్యమంత్రి ప్రకటించి..
## 50శాతం సీట్లు కేటాయించాలి

బిసిశక్తి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిట్ల నగేష్ ముదిరాజ్



సమావేశంలో అభివాదం చేస్తున్న నగేష్‌ముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

హైదరాబాద్, ఆగస్టు 6,ప్రభాతవార్త: రాష్ట్రంలోని అన్ని ప్రధానపార్టీలు బిసి ముఖ్యమంత్రిని ప్రకటించి బిసిలకు 50శాతం సీట్లు కేటాయించాలని బిసిశక్తిసంఘం రాష్ట్ర అధ్యక్షులు పిట్ల నగేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కన్వీనర్ నాగుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమవేశంలో 20బిసికులసంఘాలు, సామాజిక ఉద్యమ సంఘాల నేతలు హాజరయ్యారు. ఈసందర్భంగా పిట్ల నగేష్ ముదిరాజ్ మాట్లాడుతూ జనాభాలో అత్యధికశాతం ఉన్న బిసిలు ఎన్నో ఏళ్లుగా అణచివేతకు గురవుతున్నారన్నారు. వచ్చే సార్వత్రిక ,అసెంబ్లీ ఎన్నికల్లో బిసి అభ్యర్థులను గెలుపించేందుకు ప్రతిబిసిఓటరు ప్రతినపూనాలన్నారు. ఏపార్టీ బిసిలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటిస్తారో ఆపార్టీకి మద్దతిస్తామన్నారు. అలాగే ప్రతి బిసి కుటుంబానికి 10లక్షలు ఇవ్వడంతోపాటు బిసి కార్పొరేషన్, ఎంబిసి కార్పొరేసన్‌లకు నిధులు కేటాయించి బిసిసాధికారతకు రాష్ట్ర స్థాయి బిసి భవన్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో హైకోర్టు జేఏసీ కన్వీనర్ బత్తులకృష్ణ, బోయకుల సంఘం అధ్యక్షులు బోయగోపి, లంబాడీ హక్కుల పోరాట సమితి బాలాజీ నాయక్, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

### కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

నార్సింగి, ఆగస్టు 6 ప్రభాతవార్త : మున్సిపాలిటీలు, పంచాయతీలలో దశాబ్దాల కాలంగా పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరిని పర్మినెంట్ చేయాలని కోరుతూ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, మూడు దశాబ్దాల తరబడి ప్రభుత్వంకు ఆదాయాన్ని ఆర్జించి పెట్టడంలో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. మాకు అప్పగించిన పనిని అంకిత భావంతో పూర్తి చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ ఇతర అన్ని శాఖల ఉద్యోగులను క్రమబద్దీకరించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని, అలాగే మా జీవితంలో కూడా వెలుగులు నింపి మమ్ములను ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. ఇందుకు ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు అంతా మాకు న్యాయం జరిగేలా చూడాలని వినతిపత్రం అందజేశామని నరేందర్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు పాల్గొన్నారు.

### న్యాయవాదులకు ప్రత్యేక ప్యాకెజ్ కెటాయించాలి

నాగుల శ్రీనివాస్ యాదవ్



ప్రత్యామ్నాయ రాజకీయ సదస్సులో ప్రసంగిస్తున్న హై కోర్టు న్యాయవాది నాగుల శ్రీనివాస్ యాదవ్ తదితరులు

అడ్డగుట్ట, ఆగస్టు 6 ప్రభాతవార్త: ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడుతున్న న్యాయవాధుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా రూ.500 కోట్ల బడ్జెట్ కెటాయించాలని తెలంగాణ రాష్ట్ర ప్రత్యామ్నాయ రాజకీయ హాడక్ కమిటీ కన్వీనర్ హై కోర్టు న్యాయవాధి నాగుల శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం సికింద్రాబాద్ ఎస్.డి.రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. న్యాయవాధులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ ససహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాధుల సంఘం నేతలు బోయ గోపి, జగన్ మోహన్ ముదిరాజ్, బత్తుల క్రిష్ణ, బాలాజీ నాయక్, పరమేశ్వరీ, సత్య నారాయణ, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జవహర్‌నగర్ సీతారామాంజనేయ స్వామి దేవాలయం నూతన కార్యవర్గం ఎన్నిక



యూసుఫ్‌గూడ, ఆగష్టు 6, ప్రభాతవార్త : వెంగళరావు నగర్‌లోని జవహర్ నగర్ శ్రీసీతారామంజనేయ స్వామి దేవాలయం నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. ఇందులో అధ్యక్షునిగా గణేష్ ప్రసాద్ సింగ్ 150ఓట్లకు గాను 109 ఓట్లు కైవసం చేసుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా 150ఓట్లకు గాను శిల్పశెట్టి నందుకుమార్ 104 ఓట్లు కైవసం చేసుకున్నారు. కోశాదికారిగా నీలాదామోదర్ 150ఓట్లకు గాను 89ఓట్లతో విజయం సాధించారు. ఆలయ పవిత్రను కాపాడేందుకు తమవంతు కృషి చేస్తామని ఈసందర్భంగా నూతన కమిటి సభ్యులు పేర్కొన్నారు.

## జయశంకర్ సేవలు మరువలేనివి

టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం



జయశంకర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సత్యంశ్రీరంగం

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 6, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ప్రొఫె సర్ జయశంకర్ సేవలు మరువలేనివని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. ఆదివారం ముసాపేట ఆంజనేయ నగర్‌లో బిసి ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు, అధికార ప్రతినిధి డా.సత్యంశ్రీరంగం ముఖ్య అతిథిగా పాల్గొని జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పుగూడ రైల్వేస్టేషన్ పనులకు శంకుస్థాపన



రైల్వే స్టేషన్ పనులను ప్రారంభిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత కిన్నెర మొగిలయ్య, కార్పొరేటర్‌లు ఆలె భాగ్యలక్ష్మి, శ్వేతామధుకర్ రెడ్డి

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 6 ప్రభాత వార్త : అమృత్ భారత్ స్టేషన్‌ల పథకంలో భాగంగా రూ.26.80 కోట్ల రూపాయలతో ఆధునీకరించనున్న ఉప్పుగూడ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులకు ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ ద్వారా ప్రారంభించారు. ఈ అభివృద్ధి పనులను పద్మశ్రీ అవార్డు గ్రహిత కిన్నెర మొగిలయ్య, కార్పొరేటర్‌లు ఆలె భాగ్యలక్ష్మి, శ్వేతామధుకర్ రెడ్డిలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 508 రైల్వే స్టేషన్‌ల అభివృద్ధిలో పాతబస్తీ ఉప్పుగూడ రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఎంపిక చేయడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే చీఫ్ మెడికల్ సూపరిండెంట్ అనురాధ, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ శ్రీతేజ, ప్రతాప్, మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర, బిజెపి నాయకులు రూప్‌రాజ్, సుమన్ కుమార్, ధీరజ్‌లాల్, జె.అశోక్, శివచంద్రగిరి, పండరీనాథ్, రఘుకాంత్ పాల్గొన్నారు.

## బస్తీ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు



రామారావు నగర్ అధ్యక్షునిగా వెంకటయ్య యాదవ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

యూసుఫ్ గూడ, ఆగష్టు 6, ప్రభాతవార్త : రామారావునగర్ బస్తీ అభివృద్ధికి తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. రామారావు నగర్ బస్తీ నూతన అధ్యక్షునిగా బి.వెంకటయ్య యాదవ్, ప్రధాన కారదర్శిగా బి.వెంకట రమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈసందర్భంగా మర్యాద పూర్వకంగా స్థానిక ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావును కలువగా వారిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం బస్తీలో మాజీ అధ్యక్షులు తమ నియోజకర్గం బిసి సెల్ అధ్యక్షులు నాగుల సత్యం ఆధ్వర్యంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులను ప్రత్యేకంగా సన్మానించారు.తమపై నమ్మకంతో తమకు ఈఅవకాశం ఇచ్చినందుకు తమ వంతు భాద్యతగా ప్రజలకు, అధికారులకు ప్రజా ప్రతినిధులకు వారధిగా ఉంటూ బస్తీ అభివృద్ధికి తమ వంతు శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని నూతన అధ్యక్షులు వెంకటయ్య యాదవ్ పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో ఆవుల సంజీవ, పి.శివయ్య, బిక్షపతి, ఎమ్‌కృష్ణ, ఎ.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### అన్ని సమస్యలకు పరిష్కారం రాజ్యాధికారమే

చిక్కడపల్లి, ఆగస్టు 6ప్రభాతవార్త: ఎస్సీలు, గిరిజనులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బంధ్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు పి.వీరస్వామి అధ్యక్షతన కారంచేడు, చుండూరు, లక్ష్మీపేట మృతవీరులకు నివాళులు అర్పిస్తూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో పలు తీర్మాణాలను ఆమోదించారు. ఈ సమావేశంలో దక్షిణమధ్యరైల్వే పూర్వ సీఎంఈ డి.పోతరాజు, దక్షిణమధ్యరైల్వే రిటైర్డ్ సీసీఎం ఎ.భరత్‌భూషణ్, బంధ్ సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎర్ర దేవదానం, ఎస్.నర్సింగరావు, ప్రొఫెసర్ నతానియేలు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రధాన కార్యదర్శి వి.కామేశ్వరరావు, బెజ్జంకి రాంబాబు, డిఎం.అశోక్‌కుమార్, జి.కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ ఆటోల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలి : 16న 'ఆటో బంద్'

సైఫాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త: ఎలక్ట్రిక్ ఆటోల రిజిస్ట్రేషన్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని లేకపోతే సిఎం కెసిఆర్‌కు ఎలక్ట్రిక్ షాక్ ఇవ్వడానికి ఈ నెల 16న ఒక రోజు 'ఆటో బంద్' నిర్వహిస్తామని షేక్ హ్యాండ్ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జెఎసి హెచ్చరించింది. ఎలక్ట్రిక్ ఆటోల రిజిస్ట్రేషన్ చట్ట వ్యతిరేకమైదని వాహన కాలుష్యం తగ్గింపు పేరుమీద జంటనగరాలలోని లక్షలాది మంది ఆటో డ్రైవర్లను రెండు గ్రూపులుగా చీల్చడానికి ఎలక్ట్రిక్ ఆటోలను ఆయుధంగా ప్రభుత్వం వాడుకుంటున్నదని జెఏసి ప్రతినిధులు మహ్మద్ అమానుల్లాఖాన్, జి.ఆంజనేయులు ఆరోపించారు. ఆదివారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి కాలుష్యం తగ్గించాలనే చిత్త శుద్ధి ఉంటే తక్షణమే జంటనగరాలలో ఉన్న లక్షన్నర ఎల్‌పిజి, సిఎన్‌జి ఆటోలకు ప్రభుత్వం తన సొంత ఖర్చుతో ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చాలని డిమాండ్ చేశారు. పొరుగు జిల్లాల నుంచి చట్ట వ్యతిరేకంగా నగరంలోకి ప్రవేశిస్తున్న ఆటోలను అడ్డుకోవాలని, ఫారం 36ను దుర్వినియోగం చేస్తున్న వారిని తక్షణమే అరెస్టు చేయాలని, గత 9 సంవత్సరాల నుంచి కెసిఆర్ ప్రభుత్వం నేరపూరిత నిర్లక్ష్యానికి పాల్పడుతూ ఆటో మీటర్ చార్జీలను పెంచనందుకు ఆటోడ్రైవర్లకు క్షమాపణ చెప్పాలని, జీవో నెంబరు 137ను ఉల్లంఘిస్తూ జంటనగరాలలో రిజిష్టరు అవుతున్న ఎలక్ట్రిక్ ఆటోలను వెంటనే నిషేధించాలని వారు డిమాండ్ చేశారు.

## అమ్మవారి దీవేనలతో అందరూ బాగుండాలి : మేయర్ నీలాగోపాల్‌రెడ్డి



మేయర్‌ను నీలాగోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆలయకమిటి సభ్యులు

నిజాంపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లి పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో ఆదివారం జరిగిన బోనాల పండుగలో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా నల్ల పోచమ్మ తల్లి అమ్మవారికి ఆమె ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ బాగుండాలని అభిలషించారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ ఆగం పాండు, కార్పొరేటర్లు ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, గాజుల సుజాత, నాయకులు సబితజలంధర్‌రెడ్డి, ఎన్ఎంసి యూత్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌గౌడ్, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు..

**ఇంద్రానగర్‌లో..** నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, ఇంద్రానగర్‌లో జరిగిన బోనాల ఉత్సవాలలో కో-అప్షన్ సభ్యులు మహ్మద్ సలీమ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయప్రసాద్‌లు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, జనరల్ సెక్రటరీ నాగరాజ్‌యాదవ్, బిసిసెల్ సెక్రటరీ దశరథ్, మాజీవార్డుసభ్యులు కుమార్‌రెడ్డి, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## సి.పి.ఎస్. విధానంతో ఉద్యోగుల పాట్లు

బేగంబజార్, ఆగస్టు 6 ప్రభాతవార్త: కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో టి.ఎన్.జి.ఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల సమస్యల పరిష్కార సభలు కార్యక్రమం లో భాగంగా స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ హైదరాబాద్ జిల్లా యూనిట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, కార్య దర్శి ఎం.బాస్కర్ అసోసియేట్ అధ్య క్షులు వి.డేవిడ్,కోశాధికారిరి ప్రేమ్‌కుమా ర్‌లతోపాటు యూనిట్ కార్యవర్గం ప్రతిని ధులతో కలిసి స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబం ధించిన పూర్తి నివేధికను టి.ఎన్.జి.ఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీలకు అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సి.పి.ఎస్.విధానం వల్ల ఉద్యోగులు పడరాని పాట్లు పడుతున్నారని, రిటైర్డ్, అయిన తర్వాత వారి బ్రతుకు ఆగమ్యగోచరంగా మారుతున్నందున,ఈ విధానాన్ని వెంటనే రద్దు చేసి,పాత విధానాన్ని అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరారు.

## విద్యార్థులకు ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**ఎమ్మెల్యే మాధవరం**



విద్యార్థులకు చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 6, ప్రభాతవార్త : ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చేయూత నిచ్చేందుకు ప్రతి ఒక్కరు తమవంతు చేయూత నివ్వాలని కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం కూకట్‌పల్లి ఎన్‌కెఎన్ఆర్ గార్డెన్‌లో ఆలివ్ మిఠాయిషాప్ అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10కి 10 మార్కులు సాధించిన విద్యార్థులకు లక్ష రూపాయల బహుమానం ఎమ్మెల్యే చేతులమీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే 11వేల మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌తో పుస్తకాలతో కూడిన కిట్టులను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, ఎంఈఓ ఆంజనేయులు, ఆలివ్ స్వీట్స్ అధినేత దొరరాజు, కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, పగడాల శిరీషబాబురావు, పండాల సతీష్‌గౌడ్, సబియాగౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా బిఆర్ఎస్ పార్టీ నిలబడుతుంది

యూసుఫ్‌గూడ, ఆగస్టు 6, ప్రభాతవార్త : అన్ని వేళల బిఆర్ఎస్ పార్టీలో నాయకులకు కార్యకర్తలకు అండగా నిలవడం జరుగుతుందని టిఎస్ఈడబ్ల్యూఐడిసి చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి అన్నారు.ఇటీవల బ్రైన్ సర్జరీ చేయించుకున్న బిఆర్ఎస్ జూబ్లీహిల్స్ నియోజక వర్గం మాజీ మహిళా అధ్యక్షురాలు, ఉద్యమకారిని అనితా కృపారాణిని బిఆర్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ దినేష్ చౌదరితో కలిసి టిఎస్ఈడబ్ల్యూఐడిసి చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు .ఈసందర్భంగా అనితా ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుకుని ఆమెను అధైర్య పడవద్దని ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉన్న పార్టీ తరపున తాము ఆదుకుంటామని పేర్కొన్నారు.

## బస్తీలలో విస్తృతంగా సీసీ కెమెరాలను ఏర్పాటు

**ఎమ్మెల్యే ముఠాగోపాల్**



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠాజైసింహా

చిక్కడపల్లి, ఆగస్టు 6ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గంలో కాలనీలు, బస్తీలలో సీసీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్ వార్డు కార్యాలయం లో ఎమ్మెల్యేముఠాగోపాల్ తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహాతో కలిసి లాంఛనాలతో ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని, ఇందులో భాగంగానే కమాండ్ కంట్రోల్ అనే అధునాతన వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి కాలనీ, బస్తీలలో కమిటీలు కకూడా విరివిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి పోలీసులు తీసుకునే శాంతిభద్రత చర్యలకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. పోలీసు వ్యవస్థను పటిష్టం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, నేతలు ముఠానరేశ్, రాజమోహన్, ఆకుల శ్రీనివాస్, పున్న సత్యనారాయణ, జి.వెంకటేశ్, కుమారస్వామి, గడ్డమీది శ్రీనివాస్, రమేశ్, సుధాకర్, భాస్కర్, సంతోష్, వంశీ, కిరణ్‌కుమార్, వంశీ, కిరణ్‌కుమార్, బాబుతదితరులు పాల్గొన్నారు. స్థానిక కాలనీ సంఘం, జనహిత ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోజ్, కిట్టు, రాజు, క్రాంతి, నరేందర్, శ్యామ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు అండగా ప్రభుత్వం ఉంది

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**

సంజీవరెడ్డి నగర్, ఆగస్టు 6, ప్రభాతవార్త : ఆర్థిక ఇబ్బందుల కారణంతో విద్యార్థులు తమ చదువును మధ్యలో ఆపొద్దని, పేద విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం సనత్‌నగర్‌లోని సంకేత్ సోషల్ ఆవేర్‌నెస్ ఆర్గనేజేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చెక్కులను మంత్రి శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా ఆర్థిక సహాయం అందించిన సంకేత్ నిర్వాహకులను అభినందించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలు మరింతగా విస్తరించాలని, అందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. సంకేత్ ఆర్గనేజేషన్ కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు గాను వ్యక్తిగతంగా 5లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తానని ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకొనే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలపై ఉన్న అపోహాలను తొలగించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు మన బస్తీ, మన బడి కార్యక్రమం క్రింద ప్రభుతవ ం 7200 కోట్ల రూపాయల వ్యయంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన ఫర్నిచర్, త్రాగునీటి వసతి, విద్యుత్, టాయిలెట్స్ సౌకర్యాలను కల్పిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా ప్రభుత్వ వైద్య సేవలను కూడా ప్రజలకు చేరువ చేసేందుకు నూతనంగా ఎర్రగడ్డలో వెయ్యి పడకలతో సూపర్ స్పెషాలిటి హాస్పిటల్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, సంకేత్ సంస్థ అధ్యక్షుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా చౌడ్యాన్స్ శిక్షణా శిబిరం

రవీంద్రభారతి, ఆగస్టు 6 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో ఇండియన్ మైమ్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో పదిరోజులపాటు నిర్వహించిన చౌడ్యాన్స్ శిక్షణా శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రముఖ గురువు భూమికేష్‌సింగ్ శిక్షణా శిబిరంలోని 25మంది ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చారని, ఈ చౌడ్యాన్స్ ముఖ్యంగా నటులకి, డాన్సర్లకు ఎక్కువ ఉపయోగింపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన భూమికేష్‌సింగ్, మైమ్ అకాడమీ ప్రముఖ గురువు మైమ్ మధు తదితరుల చేతులమీదుగా శిక్షణ సంపూర్ణంగా పూర్తిచేసిన 25మంది విద్యార్థినీ విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానంచేసి ఎంతగానో అభినందించి ముమ్ముందు వారు గొప్ప కళాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

దుండిగల్, ఆగస్టు 6 ప్రభాతవార్త : విద్యుత్ తీగలకు అడ్డుతగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించడంలో భాగంగా దొమ్మరపోచంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం(07-08-2023) రోజు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11కెవి ఇండోఫ్యాబ్, ఇండియన్ ఆయిల్ ఫీడర్ల పరిధిలోని 60గజాల కాలనీలు, సాయిపూజకాలనీ, బి,చంద్రశేఖర్‌రెడ్డినగర్, మల్లికార్జుననగర్, రాజుబస్తీ, డాక్టర్‌బస్తీ, శివశక్తికాలనీ, గండిమైసమ్మఎక్స్ రోడ్స్‌లలో ఉదయం 9గంల నుండి మధ్యాహ్నం 1గంల వరకు, 11కెవి ఐడిఏ ఫీడర్ పరిధిలోని వర్టెక్స్‌వేదా అపార్ట్‌మెంట్స్, మిర్చి దెవలపర్స్, అక్షయదెవలపర్స్, గురుకుల్‌స్కూల్, విశ్వ సాయిటౌన్‌షిప్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహకరించాల్సిందిగా ఏఈ కోరారు.

## ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్లక్ష్యంగా పారేయరాదు



ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుతున్న అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు

హైదరాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త: ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని కోరుతూ సామాజిక సేవకురాలు కవితరావు ఆధ్వర్యంలో ఆదివారం అంబర్‌పేట డివిజన్‌లోని సిఈ కాలనీలో చేపట్టిన కార్యక్రమంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొన్నారు. ఆమెతో పాటు ఎమ్మెల్యే కాలనీలో విస్తృతంగా పర్యటించి ప్రజలతో మమేకమై ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్లక్ష్యంగా పారేయరాదని, కాలనీవాసులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే దోమలు రావని, వ్యాధులను నివారించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

**తుంతియా అధ్యక్షులు జ్ఞానేశ్వర్**




మాట్లాడుతున్న అధ్యక్షులు బియాని జ్ఞానేశ్వర్

తార్నాక, ఆగస్టు 6 ప్రభాతవార్త: బోధనేతర ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యోగులందరు కలిసికట్టుగా ఉండాలని తుంతియా అధ్యక్షులు బియ్యాని జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. ఓ.యూలో బోదనేతర ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమూవేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బియ్యాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా కాంట్రాక్ట్ పద్దతిలో పనిచేస్తున్న వారిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని కోరారు. బోధనేతర ఉద్యోగుల సమస్యలు ఎన్నో ఉన్నాయని వాటిని ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా పాత పెన్షన్ విధాన్ని అమలు చేయాలని, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు 67 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. వర్సీటీలల్లో ఖాలీగా ఉన్న బోధన, భోతనేతర పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు హెల్త్‌కార్డులను ఇవ్వాలన్నారు. వివిద సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 2,3 తేదీల్లో ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ స్తాయిలో ప్రదర్శనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్టార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, డా.పుల్లా శ్రీనివాస్, అమృత్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, మహేష్ గౌడ్, శివ శంకర్, శ్రీనివాస్ యాదవ్, తిరుపతి, యాదగిరి, సాయి గౌడ్, అక్బర్ బేగ్, నాగరాజారావు, విజయ్‌కుమార్, శంకరయ్య, భిక్షపతి, భీమయ్య, అశోక్, రవి, రాకేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## డ్యూటీ గన్‌తో కాల్చుకుని ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి ఆత్మహత్య



అల్వాల్, ఆగస్టు 6 ప్రభాతవార్త: ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి డ్యూటీ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం రాత్రి 7.30 గంటలు సమయంలో హాకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో సంఘటన జరిగింది. గార్డ్ పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న సాహిల్ మన్(22) ఏకె 103తో కాల్చుకున్నాడు. సంఘటనా స్థలంలోనే ఆయన ప్రాణాలు విడిచాడు. వ్యక్తిగత సమస్యలు కారణంగానే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా రవికుమార్



గన్‌ఫౌండ్రి, ఆగస్టు 6 ప్రభాతవార్త: అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎల్.రవికుమార్ పదవి భాద్యతలు చేపట్టారు.ఇక్కడ విధులను నిర్వహించిన శ్రీనివాస్ వర్మ బదిలీ కావడంతో ఇటీవలే సిఐగా పదోన్నతి పొందిన 2009కు చెందిన రవికుమార్‌ను నియమిస్తూ నగర పోలీస్ కమీషనర్ సి.వి. ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈసందర్భంగా నగరంలో ప్రధాన కేంద్రంగా ఉన్న అబిడ్స్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తన వంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా వ్యాపారులు తమ దుకాణాల ముందు వాహనాలను క్రమబద్దీకరణంగా పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలను ఉల్లఘీస్తే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు.

### గోషామహాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా మహేష్‌గౌడ్



గోషామహాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా కె.మహేష్‌గౌడ్ పదవి భాద్యతలు స్వీకరించారు.కాగా ఇక్కడ విధులు నిర్వహించిన సిఐ గురునాథ్ చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో మహేష్‌గౌడ్‌ను నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోషామహాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నివారణ కొరకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.వ్యాపారులు కూడా అడ్డదిడ్డంగా వస్తువులు పెట్టకుండా, వాహనాలను క్రమ బద్దీకరణంగా పెట్టుకోవాలన్నారు.ట్రాఫిక్ నియమ నిబంధనలను ఉల్లంఘీస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ఎఫ్‌సిఐ మెంబర్లు రైతులకు అండగా ఉండాలి : ఎస్.కె.వర్మ

కంటోన్మెంట్,ఆగస్టు 6 ప్రభాతవార్త: ఫుడ్ కార్పోరేషన్ ఇండియా (ఎఫ్‌సిఐ) తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు రైతులకు అండగా ఉంటూ ఆహార ధాన్యాల సేకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని న్యాయమూర్తి ఎస్.కె.వర్మ తెలిపారు. సికింద్రాబాద్‌లో ఫుడ్ కార్పోరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై పలు అంశాలపై చర్చించారు. ఆహార ధాన్యాల ఉత్పత్తి, వాటి భద్రతకు ఎఫ్‌సిఐ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ప్రతినిధులు ఎస్.ఎస్. మూర్తి, తిరుపతిల సారధ్యంలో సమావేశం జరిగింది.

## ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



పర్వత్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరంలో మందులను అందజేస్తున్న బిజేపి రాష్ట కార్యవర్గ సభ్యులు శరణ్‌చౌదరి

యూసుఫ్‌గూడ, ఆగస్టు 6, ప్రభాతవార్త : పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గాను ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని బిజేపి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పన్నాల హరిష్‌రెడ్డి అన్నారు.ఆదివారం పర్వత్‌నగర్‌లో కమిటీ హాల్ వద్ద బిజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శరణ్ చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిభిరంలో పన్నాల హరీష్‌రెడ్డితో పాటు రాష్ట్ర బిజేపి కార్యవర్గ సభ్యులు వడ్డెపల్లి రాజేశ్వరరావు, బిజేపి మేడ్చల్ జిల్లా ఓబిసి మోర్చ ఉపాధ్యక్షులు పులిగోళ్ళ శ్రీనువాస్‌యాదవ్‌లు పాల్గొన్నారు. ఈవైద్య శిబిరంలో వైద్యులు బిపి, షుగర్, కంటి పరిక్షలు, దంత పరీక్షలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో చుట్టుప్రక్కల ప్రాంతాలనుంచి ప్రజలు వైద్య శిభిరంలో పాల్గొని వైద్య పరిక్షలు నిర్వహించుకున్నారు. అవసరమయిన వారికి వైద్య పరిక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో లైన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ప్రేమ్‌కుమార్, కార్పోరేటర్ మహేందర్, మేడ్చల్ జిల్లా మహిళా మోర్చ సెక్రటరీ పులిగోళ్ళ శ్రీలక్ష్మీ యాదవ్, బిజెవైయమ్ సెక్రటరీ భాను, డివిజన్ బిజెపి అధ్యక్షులు విజయ్‌కుమార్, బొంతు హరికృష్ణ, రామకృష్ణ, అభిషేక్, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అంకిత్, సాయిచంద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

బేగంపేట ఆగస్టు 6,ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని,దీని ద్వారా భావితరా లకు మనం ఆహ్లాదకరమైన ప్రకృతిని అందివ్వగలు గుతామని తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పోరేషన్ ఛైర్మన్ మన్నె క్రిషాంక్ అన్నారు.గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా ఆయన ఆదివారం కంటోన్మెంట్ వార్డు 3టెస్ట్‌బుక్ కాలనీలో మొక్కను నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు ప్రగతికి మెట్లు అని వాటిని సంరక్షించాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు.ఈ కార్యక్రమంలో 100మంది స్థానికులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలను నాటారు. కార్యక్రమంలో జగదీశ్వర్, హర్షవర్ధన్‌రెడ్డి, నర్సింగరావు,ప్రభాకర్,ప్రవీణ్ గుప్తా,హేమ,అడ్డగుట్ట రాజు,చంద్రశేఖర్, అనిల్‌షా,సంతోష్,శ్రీమల్ తదితరులు పాల్గొన్నారు.

**జీవో నెం 58,59 కింద ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరణ చేయాలి**

**కంటోన్మెంట్..** కంటోన్మెంట్ 5వ వార్డులోని అంబేద్కర్ నగర్‌లో శనివారం రాత్రి తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నెక్రిషాంక్ ఆధ్వర ్యంలో నిర్వహించిన 18వ బస్తీ నిద్ర కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఈ సందర్భంగా మన్నెక్రిషాంక్ మాట్లాడుతూ ఇండ్ల స్థలాల క్రమబద్దీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీవో నెంబర్ 58,59 కింద దరఖాస్తు చేసుకున్న వారందరికి ఇండ్ల పట్టాలు జారీ చేయాలన్నారు. ప్రజలు ఎదురొ ్కంటున్న సమస్యలను అధికారు దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు సైదులు, శ్రీకాంత్ రెడ్డి, విష్ణు, వెంకట్, మోని, రఘు, సాయి, రాజు పాల్గొన్నారు.

## శాంతి ర్యాలీ నిర్వహించిన క్రైస్తవులు



సంజీవరెడ్డి నగర్, ఆగస్టు 6, ప్రభాతవార్త : సనత్‌నగర్‌లోని చర్చ్‌లో క్రైస్తవులు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ ఆకృత్యాలు, అత్యాచారాలు అదుపు చేయాలని, శాంతి భద్రతలను కాపాడాలని కోరుతూ జెక్ కాలనీలోని బాప్టిస్ట్ చర్చ్ నుండి సనత్‌నగర్ పరిసర ప్రాంతాలలో చర్చీలను కలుపుకుంటూ ఎర్రగడ్డలోని సెంట్ తెరాసాస్ చర్చీ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం చర్చీలో సభను నిర్వహించి వివిధ చర్చీ పాస్టర్లు నాయకులు మాట్లాడుతూ క్రైస్తవులు శాంతికాముకులని, దేశం క్షేమం కోసం ప్రార్థించేవారన్నారు. క్రైస్తవులు, పాస్టర్లను హింసించడం, మందిరాలు కూల్చివేయడం అమానుషమన్నారు. స్త్రీలను అవమానించడం మరింత దారుణమన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సనత్‌నగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, సతన్‌నగర్ డివిజన్ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు డిడి ప్రశాంత్, క్రైస్తవ నాయకులు జోహార్, భాసా, కృపాదానం, లారెన్స్, ప్రముఖ సీనియర్ న్యాయవాది సుదీర్ కుమార్, దయాకర్, ఫ్రాంక్లిన్ విలియమ్స్, శాంసన్ వివిధ చర్చీ పాస్టర్లు, క్రైస్తవ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డాగ్ బ్రీడర్స్ ఉపాధికి రక్షణ కల్పించాలి

**తెలంగాణ రాష్ట్ర డాగ్ బ్రీడర్స్ అసోసియేషన్**



డాగ్ బ్రీడర్స్ సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

ధర్నాచౌక్, ఆగస్టు 6, ప్రభాతవార్త: కుక్కల పెంపకం ద్వారా ఉపాధి పొందుతున్న డాగ్ బ్రీడర్స్ ఉపాధికి రక్షణ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర డాగ్ బ్రీడర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ముషీరాబాద్‌లో ఏర్పాటుచేసిన డాగ్ బ్రీడర్స్ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు బెంజిమెన్, సూరజ్‌నాయుడు, రమేష్‌లు మాట్లాడుతూ కుక్కలను విక్రయించే క్రమంలో కొందరు లాభాపేక్షనే ధ్యేయంగా కేసీఐ సర్టిఫికేట్, సరైన శిక్షణ, వ్యాక్సిన్‌లు లేకుండానే జంతు ప్రేమికులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ఎంతో ఆశతో కుక్కలను పెంచుకోవటానికి కొనుక్కుంటే ఆ పెంపుడు కుక్కలు కొద్ది రోజులకే మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. తెలంగాన రాష్ట్రంలో ప్రధానంగా హైదరాబాద్ నగరంలో వందలాది మంది డాగ్ బ్రీడర్స్ పూర్తి భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన కుక్కలను పెంచుతూ ఉపాధి పొందుతూ ఉంటే వారి ఉపాధిని దెబ్బతీసే విధంగా బెంగుళూరు, పంజాబ్ తదితర రాష్ట్రాల నుండి కుక్కలను తీసుకువచ్చి విక్రయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన సంరక్షణ లేకుండా తల్లి నుండి 10 నుండి 20 రోజులలోపే పిల్లలను వేరుచేసి విక్రయిస్తున్నందున అవి మృత్యువాత పడుతున్నాయని అన్నారు. తమ ఉపాధిని దెబ్బతీస్తున్న అక్రమ వ్యాపారదారులపై పోలీసు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు వెంకటేష్, సిద్దిక్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వేదికపైన మాట్లాడుతున్న జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్

## గోరక్ష పాదయాత్రకు ఘనంగా స్వాగతం

హైదరాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త: అఖిల భారత గో రక్ష సమితి ఆధ్వర్యంలో సి.హెచ్.బాలకృష్ణ గురుస్వామి ఆదివారం చేపట్టిన గో రక్షణయే మన తక్షణ కర్తవ్యం యాత్రకు హిమాయత్‌నగర్ లో ఘనంగా స్వాగతం లభించింది. హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ ఆధ్వర్యంలో అనేక మంది బిజెపి కార్యకర్తలు, గో ప్రేమికులు యాత్రకు స్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా మహాలక్ష్మీరామన్‌గౌడ్ మాట్లాడుతూ బాల కృష్ణస్వామి సికింద్రాబాద్‌లోని మహంకాళీ దేవాలయం నుంచి తిరుపతి వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నారని చెప్పారు. గోవులను రక్షించాలని, గోవులతో అనేక ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. పవిత్రమైన గోమాతలను పూజించాలని, కాపాడుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.రామన్‌గౌడ్, నగర నాయకులు నర్సింగ్‌గౌడ్, మహేష్, శారద, సుజాత, జైస్వాల్ పాల్గొన్నారు.

## ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలి : నోముల ప్రకాశ్



మారేడ్‌పల్లి న్యూక్లబ్ బోనాల ఉత్సవాల్లో పూజలు చేస్తున్న క్లబ్ అధ్యక్షుడు మనోముల ప్రకాశ్ తదితరులు

కంటోన్మెంట్,ఆగస్టు 6 ప్రభాతవార్త: ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలో జీవించాలని న్యూ క్లబ్ అధ్యక్షుడు,కాంగ్రెస్ నేత నోముల ప్రకాశ్‌రావ్ గౌడ్ తెలిపారు. ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గం వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన న్యూక్లబ్‌లోని నాగదేవత ఆలయంలో జరిగిన బోనాల ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కోశాధికారి మధుసూదన్, తెలంగాణ రాష్ట్ర టీడీపి అధికార ప్రతినిధి ముప్పిడి గోపాల్‌తో పాటు వందలాది మంది ప్రతినిధులు పాల్గొని ఘనంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు.

## పద్యామృతాన్ని బ్రోలిన పద్యామృత వర్షిణి గ్రంథం

**తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**



పద్యామృతవర్షిణి గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి, సమ్మన్న, అనంతలక్ష్మి, చిక్కారామదాసు, చిక్కాదేవదాసు

రవీంద్రభారతి, ఆగస్టు 6 ప్రభాతవార్త సహస్ర పద్య కంఠీరవ చిక్కా రామదాసు కలం నుండి జాలువారిన పద్యామృత వర్షిణ గ్రంథం పాఠకులకు పద్యామృతాన్ని బ్రోలిందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి కొనియాడారు. తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో తెలుగు సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సహస్ర పద్యకంఠీరవ చిక్కా రామదాసు, సక్కుబాయి అమృతోత్సవ వేడుకలు, ఆయన రచించిన పద్యామృత వర్షిణి గ్రంథావిష్కరణ-అంకితోత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. ప్రముఖకవి డా. ఈటెల సమ్మన్న సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభ్వు సలహాదారు డా. కె.వి.రమణాచారి, విశిష్ట అతిథులుగా డా. అనంతలక్ష్మి, బైస దేవదాసు, డా. అక్కిరాజు సుందర రామకృష్ణ, మద్ది దివాకర్‌రెడ్డి, దోరవేటి చెన్నయ్య, కె.నరసింమగౌడ్, ధనంజయగౌడ్ తదితరులతో కలిసి చిక్కా రామదాసు రచించిన పద్యామృత వర్షిణి గ్రంథాన్ని ఆవిష్కరించి రామదాసును ఎంతగానో అభినందించి, అమృతోత్సవ వేడుకలకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం రచయిత చిక్కా రామదాసు డా. ఎంపల్లి బుచ్చిరెడ్డి, కౌసల్య దంపతులను ఘనంగా సత్కరించి.. రచించిన పద్యామృత వర్షిణి గ్రంథాన్ని ఆవిష్కరించారు.



ఎంపీ బండి సంజయ్‌ను సన్మానిస్తున్న కంటోన్మెంట్ బిజెపి నేత బి.ఎన్.శ్రీనివాస్ తదితరులు



మాణిక్యాలమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి తీసుకెళ్తున్న మారుబోనం. కటారి మహేష్‌కుమార్, శివురిపాటి రమణ, మురళీమోహన్, ఇతర సభ్యులు పాల్గొన్నారు

## బడంగ్‌పేట్‌లో దళితుల అరెస్టు - అబ్దుల్లాపూర్‌మెట్ పిఎస్‌కు తరలింపు



దళిత కుటుంబాలకు ధైర్యం చెబుతున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి పారిజాత

**సరూర్‌నగర్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్‌లో తమ కుటుంబాలు సాగు చేసిన సర్వేనెంబర్ 2లోని దావూద్‌ఖాన్‌గూడ భూముల్లో ప్రభుత్వం ప్రజా ప్రయోజనార్థం తీసుకున్న భూములు పోను మిగిలిన భూమిని తమ కుటుంబాలకే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ గత కొద్ది రోజులుగా ఆందోళనలు చేస్తున్న దళిత కుటుంబాలు ఆదివారం ఉదయం ఛలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ మేరకు ఆదివారం తెల్లవారుజామునే దళిత నాయకుల ఇళ్ళవద్దకు వచ్చిన పోలీసు బలగాలు ధర్నాలకు నాయకత్వం వహిస్తున్న మహేశ్వరం నియోజకవర్గ బిఎస్‌పి అధ్యక్షుడు, దళిత నాయకుడు గుడ్ల శ్రీనివాస్‌తో పాటు కర్రె రమేష్, గుడ్ల రాములు, సురేష్‌కుమార్, ఉమాకాంత్, గుడ్ల జ్ఞానేశ్వర్, రొడ్డ సత్తయ్య, పుట్టగళ్ళ రాజ్‌కుమార్, శ్రీనివాస్, నాగభూషణ్, గుడ్ల రాజ్‌కుమార్ తదితరులను అదుపులోకి తీసుకొని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించాయి.

**కాంగ్రెస్ నేతల పరామర్శ.. దళిత కుటుంబాలకు భరోసా...**

దళితులను అరెస్టు చేశారన్న సమచారం నేపథ్యంలో స్పందించిన రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆదివారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌కువచ్చి అరెస్టయిన గుడ్ల శ్రీనివాస్ తదితరులను పరామర్శించారు. అనంతరం ఆయన స్టేషన్ బయట ఉన్న దళిత కుటుంబాల్లోని మహిళలను, చిన్నారులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అదే విధంగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి టిపిసిసి ప్రోటోకాల్ మెంబర్ బంగారు బాబు, కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కందాడి శ్రీరాంరెడ్డి, పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, తూళ్ళ నరహరిగౌడ్, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్, అనుబంధ విభాగాల నాయకులతో కలిసి అబ్దుల్లాపూర్‌కు వచ్చి దళిత నాయకులను, వారి కుటుంబాలను పరామర్శించి తాము అండగా ఉంటామని వారిలో ధైర్యం నిలిపారు. అనంతరం అరెస్టు చేసిన వారిని తక్షణమే విడిచి పెట్టాలని వనస్థలిపురం ఏసిపిని కోరారు.

## అమృత్ భారత్ పథకంలో భాగంగారైల్వే స్టేషన్ల అభివృద్ధి: కార్పొరేటర్ జంగం శ్వేత



ప్రధానమంత్రి సందేశాన్ని వీక్షిస్తున్న కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశంలోని 508 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడి ఆదివారం ప్రారంభించారు. ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పేదల పక్షాన నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పల్ సమస్యలను లేవనెత్తిన ఎమ్మెల్యే బేతి

**ఉప్పల్, జూలై 6 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల భవనానికి రెండు ఎకరాల స్థలం కేటాయించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కొత్తగా మల్టీపర్పస్ కమ్యూనిటిహాల్‌కు రెండు ఎకరాలు ఇవ్వాలని, ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని, వంద పడకల ఆసుపత్రి నిర్మించాలని సూచించారు. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి వరంగల్ జాతీయ రహదారి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దీనిపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమాదానం ఇస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లామని హామీ ఇచ్చారు.

## ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయసాధనకు కృషి : తోట శ్యాం



జయశంకర్ సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న తోట శ్యాం తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 6 ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయసాధనకు కృషి చేస్తామని ప్రొఫెసర్ జయశంకర్ సార్ అసోసియేషన్ మలక్‌పేట, హైదరాబాద్ వ్యవస్థాపక అధ్యక్షుడు తోట శ్యాం పేర్కొన్నారు. జయశంకర్ సార్‌జయంతిని పురస్కరించుకుని ఓల్డ్‌మలక్‌పేటలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాం మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సార్ మలిదశ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పాక జగన్, ప్రధాన కార్యదర్శి కుకుట్లపల్లి రవి, నాయకులు నాగరాజు టిన్నుసింగ్, మహేష్, వేణుగోపాల్, భజరంగ్, మధుసూదన్, మహ్మద్ ఇషాక్, శివ, వంశీ, వేణు తదితరులు పాల్గొన్నారు.

## 17 నుంచి 20 వరకు రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు

**మలక్‌పేట, ఆగస్టు 6 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ అథారిటీల ఆధ్వర్యంలో రేయిన్ బో స్కై సౌజన్యంతో 9వ రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 17 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు తెలిపారు. శేరిలింగంపల్లిలోని నల్లగండ్ల డాక్టర్స్ కాలనీ ప్లాట్ నంబర్-85 పార్ట్-ఏలో నిర్వహించనున్న ఈ పోటీల్లో అండర్-15 బాల, బాలికల విభాగంలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు నిర్వహించనున్నటు తెలిపారు. క్రీడాకారులు ఈ నెల 14 లోపుగా ఎంట్రీ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల సంబంధించి https://btronline.in/ వెబ్‌సైట్‌లో రిజిస్టేషన్ చేసు కోవచ్చన్నారు. సింగిల్స్‌కు రూ.800, డబుల్స్ రూ.1000, మిక్స్‌డ్ డబుల్స్‌కు రూ.1000 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, వివరాలకు 9848015443, 7788993006 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. సమావేశంలో టోర్నమెంట్ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఉపాధ్యక్షులు కె.లక్ష్మణ్, పి. అనందబాబు, టీఎన్ఆర్ రవి, కోశాధికారి యూవీఎన్ బాబు, సంయుక్త కార్యదర్శి బి.సాయిరెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ : ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బేతి, జోన్ల ప్రభాకర్‌రెడ్డి

**కుషాయిగూడ, ఆగస్టు 6 ప్రభాతవార్త :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావకర్త అని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్ చర్లపల్లి జయశంకర్ చౌరస్తాలో గల ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, జోన్ల ప్రభాకర్‌రెడ్డిలు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల రూపకల్పన మూలంగా ఏర్పాటైన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం బంగారు తెలంగాణ రాష్ట్రంగా ఏర్పాటుచేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న కృషికి తమవంతు మద్దతు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, దేవేందర్‌రెడ్డి, నాయకులు, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, జనంపల్లి వెంకటేశ్వరరెడ్డి, కాశం మహిపాల్‌రెడ్డి, బోదాసు లక్ష్మీనారాయణ, బొల్లంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నరసింహ, చందు, గిరి, మొగులయ్య, నందకిషోర్, మజ్జిద్, రఘు, కృష్ణప్రసాద్, ప్రహ్లాదరెడ్డి, మురళి పంతులు, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ఫరీహా అహ్మద్‌కు సన్మాన కార్యక్రమం

**మలక్‌పేట, ఆగస్టు 6 ప్రభాతవార్త :** హైదరాబాద్‌కు చెందిన న్యాయ విద్యార్థి మహమ్మద్ ఫరీహా అహ్మద్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ, తదితర దశలను క్లియర్ చేసిన ఆమెను శిక్షణకు పంపనున్నారు. మలక్‌పేట్‌లోని డాన్ హైస్కూల్‌లో ఫరీహా అహ్మద్‌ను నేడు ఉదయం 11గంటలకు సన్మానించనున్నారు. అనంతరం ఆమె ప్రసంగంతోపాటు ప్రశ్నోత్తరాల సెషన్ విద్యార్థులకు ప్రయోజనంతో పాటు స్ఫూర్తిని కలిగిస్తుందని డాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ ఫజ్లుర్ రహ్మాన్ ఖుర్రం తెలిపారు. ముఖ్యంగా న్యాయ రంగంలో వృత్తిని కొనసాగిస్తున్న మహిళలు కూడా స్ఫూర్తిని పొందవచ్చన్నారు.

## వైభవంగా కొత్తపేట బోనాల ఉత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, ఆగస్టు 6 ప్రభాతవార్త :** కొత్తపేట శ్రీప్రసన్నమహాకాళీ దేవాలయంలో బోనాల జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. పలువురు భక్తులు పెద్దఎత్తున దేవాలయానికి బోనాలతో తరలివచ్చి అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, ఎల్బీనగర్ కాంగ్రెస్ ఇన్చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ సుజాతనాయక్, ముద్దగౌని లక్ష్మీప్రసన్న, సామా రమణరెడ్డిలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు లింగాల రాహుల్‌గౌడ్, చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్, నాయకులు వజీర్ ప్రకాష్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్కే జాఫర్, పండాల రాజశేఖర్‌గౌడ్, చిన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి కుల వృత్తులవారికి తక్షణమే అర్థిక సహకారం అందించాలి : టిఆర్‌విఎస్



సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షురాలు సుభద్ర, జ్యోతి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 6 ప్రభాతవార్త :** తెలంగాణలో ప్రవేశపెట్టిన బిసి కుల వృత్తుల లక్ష రూపాయల పథకానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.సుభద్ర, కార్యదర్శి జ్యోతి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం చిలుకానగర్‌లో జరిగిన రజక వృత్తిదారుల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారూ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మూడు విడతలుగా నిరంతర ప్రకియగా విడుదల చేస్తామని ప్రకటించినా ఆచఅణలో అమలు చేయడం లేదన్నారు. ఇప్పటి వరకు రూ.లక్ష చెక్‌లను పంపిణీ చేయలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సి.రవి, జిల్లా సహాయ కార్యదర్శి పి.భాస్కర్, సభ్యులు ఎం.ఉమా, సి.యాదమ్మ, ఆర్.లక్ష్మి, భాగ్యలక్ష్మి, రవి, లావణ్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1994-95 బ్యాచ్‌కు చెందిన బాలాపూర్ జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

**సరూర్‌నగర్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** బాలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1994-95 బ్యాచ్‌కు చెందిన టెన్త్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సుమారు 28 సంవత్సరాల తర్వాత స్నేహితుల దినోత్సవరోజు కలిసిన పూర్వవిద్యార్థులు సంతోషం వ్యక్తం చేసి ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాభ్యాసాలు పూర్తి అయిన తర్వాత జీవితంలో స్థిరపడి చిన్ననాటి మిత్రులను కలుసుకోవడం ఆనందాన్ని కలుగజేసిందని వారు తెలిపారు. అయితే తమకు చక్కని విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల రుణం తీర్చుకోవడానికి సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉంటామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తిమ్మని గిరీష్, నీరుడు శ్రీరాములు, బొర్ర రవి, గడ్డం రవి, ఎర్ర శ్రీరాములు, సిల్వేరు బాలరాజ్, అనిత, ఊర్మిళ, కళ్యాణి, విజయ, ఉమేష్, ప్రేమ్‌కుమార్, వెంకట్, రాంచందర్, బీరప్ప, శ్రీను, సుందర్, కరుణ, హేమలత, అనిత, అరుంధతి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు




మినీ శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాకారులు

**ఉప్పల్, ఆగస్టు 6 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం శ్రీ కృతి డాన్స్ అకాడమీ గురువు లలిత తిరునగరి శిష్య బృందం ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూషిక వాహనం, బ్రహ్మాంజలి, వినరో భాగ్యము, దేవ దేవం భజే, జతి స్వరం, రామాయణ శబ్దం, చంద్రచూడ, శుద్ధ బ్రహ్మ కొలువై ఉన్నాడే, బ్రహ్మమొక్కటే తదితర అంశాలను కళాకారులు విద్య,కౌశిక, నీలిమ, హరిణి, ప్రణీత, కనిష్క, యువశ్రీ,వాసవి, శ్రీదాన్య తదితర అంశాలను ప్రదర్శించారు. శ్రీమతి హరిణి, వాణి, ఉమాశంకర్, వేణువు విద్వాంసులు విచ్చేసి కళాకారులను అభినందించారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

**తుర్కయంజాల్, ఆగస్టు 6 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునగనూర్‌పరిధిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్‌రెడ్డి రంగారెడ్డి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధరామిరెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మా మంగమ్మ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలంటే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. అనంతరం మునగనూరులో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు నక్క సువర్ణ రాజు, కౌన్సిలర్ నక్క శివలింగంగౌడ్, నాయకులు మెకం అంజయ్య, వెంకట్‌రెడ్డి, మహిళలు, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### బడంగ్‌పేట్‌లో మేయర్ పర్యటన.. సమస్యల పరిశీలన

**సరూర్‌నగర్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 20వ డివిజన్ భీమిడి కాలనీ, షిర్డి ఎన్‌క్లేవ్ కాలనీల్లో ఆదివారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె కాలనీల్లో పలు చోట్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు. కాగా శనివారం 1వ డివిజన్‌లోని వరలక్ష్మినగర్, సాయికృష్ణా ఎన్‌క్లేవ్‌లలో జరుగుతున్న సిసి రోడ్డు పనులను మేయర్ పరిశీలించారు.

## ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం



కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుతున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, శివసేనారెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 6 ప్రభాతవార్త :** ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకువచ్చి కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జక్కిడి సమక్షంలో అనంతుల భరత్, వీరేష్ ఆధ్వర్యంలో గడ్డిఅన్నారం, వివిధ డివిజన్ల నుండి విద్యార్థి సంఘ నాయకులు, యువజన నాయకులు దాదాపు 500 మంది ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి ఆహ్వానించారు. అంతకుముందు శివసేనారెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలకు ఘన స్వాగతం పలికి, భారీ ర్యాలీతో దిల్‌షుక్‌నగర్‌లో ఇందిరాగాంధీ, మాజీ ఎమ్మెల్యే పి.సుధీర్ కుమార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన 9 సంవత్సరాల వ్యవధిలో బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు యువతకు మొండిచేయి చూపిందని, నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కేవలం కెసిఆర్ కుటుంబానికి మాత్రమే పరిమితమైందన్నారు. నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడు గెలవలేదని, రానున్న రోజుల్లో ఆ పార్టీ పూర్తిగా కనుమరుగవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, భీమిడి రామకృష్ణారెడ్డి, గణేష్‌రెడ్డి, మెరుగు రమేష్‌రెడ్డి, బద్దుల వెంకటేష్, బద్దుల వేణుగోపాల్, శశిధర్‌రెడ్డి, పోలేపాక కార్తీక్, అరవింద్, పవన్, అంజి, జూపల్లి కార్తీక్, శ్రీనాథ్, అభిషేక్, ఆయాజ్, హర్షచరణ్, బత్తుల పవన్ పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రఘుమారెడ్డి, బైగళ్ల రాము

**సైదాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** తెలంగాణా సిద్ధాంత కర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలని చంపాపేట డివిజన్ బిఆర్ఎస్ నాయకులు నల్ల రఘుమారెడ్డి అన్నారు. చంపాపేటలోని జయశంకర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాజిరెడ్డి, బైగళ్ల రాము, రామ్ లక్ష్మణ్, అంజిరెడ్డి, శివ, అనగొంది జంగయ్య, కొత్తపేట ప్రభాకర్, బీసుకుంట్ల సతీష్, సురేందర్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అల్మాస్‌గూడ కాలనీల్లో అభివృద్ధి శూన్యం

**సరూర్‌నగర్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ 24వ డివిజన్ కాలనీల్లో అభివృద్ధి శూన్యమనీ.. సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయని కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, డివిజన్ పార్టీ ఇంఛార్జి నవారు మల్లారెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన డివిజన్‌లోని విశాఖనగర్ ఫేజ్-2, ఆర్‌విఆర్ కాలనీల్లో పర్యటించి స్థానిక ప్రజలను కలిసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా అంతర్గత రోడ్ల దుస్థితి, పూర్తి కాని డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలించిన ఆయన కార్పొరేషన్ అధికారులు, కార్పొరేటర్ పని తీరును ఎండగట్టారు. గడచిన 4 సంవత్సరాల్లో కాలనీల్లో ఏ మాత్రం అభివృద్ధి జరగలేదనీ, ఇంటి పన్నులు వసూలు చేయడంలో చూపిస్తున్న శ్రద్ధ ప్రజలకు వసతులు కల్పించడంలో కార్పొరేషన్ విఫలమైందని విమర్శించారు. స్థానిక కార్పొరేటర్ కార్పొరేషన్ నుండి నిధులు తేవడంలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా డివిజన్ కాలనీల్లో యుద్ధ ప్రాతిపదికన సమస్యలు పరిష్కరించి ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించాలని మల్లారెడ్డి డిమాండ్ చేశారు.

## చిరస్థాయిగా జయశంకర్ సార్ పేరు



జయశంకర్ సార్‌కు నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** స్వర్గీయ ఆచార్య జయశంకర్ సార్ 89వ జయంతి కార్యక్రమం మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తాలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి బాలాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేయించిన జయశంకర్ సార్ భారీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్తగా, ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా స్వర్గీయ ఆచార్య జయశంకర్ సార్ పేరు చిరస్థాయిగా ఉంటుందన్నారు. జయశంకర్ సార్ లేని లోటు తీర్చలేనిదన్నారు. ఈ సందర్భంగా జయశంకర్‌సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించిన మంత్రికి విక్రంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇంద్రాత్ రవినాయక్, విజయలక్ష్మి రాజు, సిద్దాల లార్డ్స్ బీరప్ప, ఎనుగుల అనిల్ యాదవ్, కో-ఆప్షన్ సభ్యుడు జె.రవినాయక్, కార్పొరేషన్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్‌గౌడ్, సుదర్శన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**కార్పొరేటర్ బిక్షపతిచారి ఆధ్వర్యంలో...** 27వ డివిజన్ బిజెపి కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆందోజు లక్ష్మణాచారి, కలకొండ శ్రీనివాసచారి, శ్రీనివాసచారి, రాజుచారి, నాగచారి, వెంకటాచారి, శివకుమార్‌చారి, భాస్కర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల పండుగ



పూజలు నిర్వహిస్తున్న సామ స్వప్న సుందర్‌రెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** తెలంగాణా సంస్కృతికి బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని యాకుత్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి అన్నారు. బోనాల పండుగ సందర్భంగా ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి ఆఫీసర్స్ కాలనీలోని అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో మరుగున పడిపోయిన తెలంగాణా సంస్కృతికి పూర్వ వైభవం తెచ్చిన ఘనత బిఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ స్వప్నతోపాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## లక్ష్మీనగర్ కాలనీలో ఘనంగా బోనాలు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 6 ప్రభాతవార్త :** సరూర్‌నగర్‌డివిజన్ లక్ష్మీనగర్‌కాలనీలో అమ్మవారి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బోనాలు ఉత్సవాల కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు ఆమెను శాలువాతో సత్కరించారు. లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మందుల శ్రీధర్‌రాజ్, తడాఖా మురళి, ఆకుల మహేష్‌యాదవ్, పాశం సురేందర్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, పదాల అనిల్‌కుమార్, పుల్లటి లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు పెదవి విప్పక పోతే మీ ఇళ్లను ముట్టడిస్తాం : బద్దూరి



సమావేశంలో మాట్లాడుతున్న బద్దూరి వెంకటేశ్వరరెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 6 ప్రభాతవార్త :** పేద రెడ్డిల అభ్యున్నతి కోసం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసే విషయంలో అసెంబ్లీలో పెదవి విప్పాలని రెడ్డి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ప్రశ్నించాలని రెడ్డి సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చైతన్యపురి వెంకటేశ్వరరెడ్డి నివాసంలో రెడ్డి సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చి, మాయ మాటలు, బూటకపు మాటలు చెప్పి మా ఓట్లతో అధికారంలోకి వచ్చి మమ్మల్ని అవమానించడమే కాకుండా, పేద రెడ్డి పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట తప్పిన రాష్ట్ర ప్రభుత్వంలో కొనసాగుతూ, రాజకీయ పబ్బం గడుపుతూ పదవులకోసం ఆరాటపడుతున్న అసమర్ధ నాయకుల్లారా ఖబడ్డార్ అన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాలలోనైనా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయించి మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. ఒకవేళ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయించక పోతే, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించి, రెడ్డి నాయకుల ఇళ్లను ముట్టడించడమేకాకుండా, నియోజక వర్గాల్లో తిరగనీయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## మలక్‌పేట రైల్వే స్టేషన్ పునర్ నిర్మాణ పనులకు ప్రధాని వర్చువల్‌గా శంకుస్థాపన



ప్రధాని మోడి ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు

**మలక్‌పేట, ఆగస్టు 5 ప్రభాతవార్త :** మలక్‌పేట రైల్వే స్టేషన్ పునర్ నిర్మాణ పనులకు ఆదివారం శ్రీకాం చుట్టారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 508 రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోడి వర్చువల్‌గా ప్రారంభించారు. మలక్‌పేట రైల్వే స్టేషన్‌ను రూ. 36.44 కోట్లతో అన్నివిధాలుగా అభివృద్ధి చేసి సుందర ంగా తీర్చిదిద్దనున్నారు. ఫ్లాట్ ఫాంనెం.1లో ఎల్ఇడి తెరను అమర్చగా కార్యక్రమానికి విచ్చేసిన నాయకులు, ప్రజాప్రతినిధుల, అధికారులు ప్రధాని మోడి ప్రసంగాన్ని తిలకించారు. ఈ సందర్భంగా బిజెపి జాతీయ నాయకుడు నల్లు ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడి దేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎవిఎన్‌రెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ వహీద్, ఇజల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి, కొత్తకాపు అరుణ, అధికారులు కేశవ్ కపిలేష్, సురేష్‌బాబు, నాయకులు లింగాల హరిగౌడ్, సుభాష్‌చందర్‌జీ, బొక్క మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.